కథానిక

మేం నలుగురం

యం. హీరాలాల్ రాయ్

ప్రజ్వలించిపోయే సూర్యకిరణాల ధాటికి జడిసి, పొద్దస్తమానం ఎటూ వెళ్ళడానికే వీల్లేకుండా పోయింది. కాని, చూస్తుండగానే సూర్యుడు ముసలాడైపోయాడు. దానంతటనే రానే వచ్చింది రాత్రి, ఏనాడూ తొమ్మిది గంటలకి నేను నిద్రపోయినపాపాన పోలేదు. నిద్ర పట్టి చస్తేగా? మా అమ్మ ఎప్పుడూ గోల పెడుతూనే వుంటుంది. "జబ్బు చేస్తుందని" కాని నేను రాత్రిపూటనే తప్ప పగలు తిరిగే అవకాశం కనపడదు. జర్జరీభూతమై పోతూన్న యీ మనస్సుకి కొంత సంతృప్తీ, శాంతీ లభించాలంటే మిత్ర బృందాన్ని కలుసుకోవడం తప్ప గత్యంతరం లేదు.

అమ్మకి కనపడకుండా చిన్నగా బజార్లో అడుగెట్టాను. ఆవిడకి రోజూ అలా గోలచేయడం నాకిలా బయల్దేరిరావడం అలవాటైన విషయంలే. ఐనా ఆవిడ ముందు ప్రత్యక్షంగా నేను బజారుకి బయల్దేరడానికి జంకేవాణ్ణి. ఇవాళా అంతే.

బజార్లో రెండుపక్కలా చూస్తు వెడుతూన్నాను; మిత్రులెవరన్నా కలుస్తారేమోనని. మా మిత్రులంతా నిశాచరులే కావడంతో నేను రాత్రిపూటే నా సంచార కార్యక్రమం ఏర్పరచుకోక తప్పనిసరి అవుతోంది. అంతా ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగింటివరకు గాడిదచాకిరీ చేసి అలిసిపోయి వచ్చేవాళ్ళే. ఇంటికొచ్చి ఓ చక్కని కునుకుతీసి, ఆరున్నరకి లేచి, శుభ్రంగా బజారు కొచ్చేస్తారు వాళ్లు.

ఎదురుగా "బృందావన్ లంచ్ హోమ్" లోంచి 'లతామంగేశ్కర్' గానం మధునదంలా పాయలుపాయలై ప్రవహిస్తూ బయల్పడుతోంది. 'లత' పాటలు నా గుండెల్లో చెవుల్లో వేదనాగ్ని రేపుతాయెందుకో. లత తీయనికంఠం నన్ను స్మృతిలేనివాడుగా తయారుచేస్తుంది. ఆ పాటలన్నా అంత మధురాతిమధురత్వమన్నా నేను భరించలేను. ఆ పాటలకి జాగ్రత్తపడి నేనెంతదూరం వున్నా శాకవి వినిపిస్తూనే వుంటాయి. అబ్బబ్బ! బజార్లో నడుస్తున్నా, మూత పడ్డ పాడుకొంపల మూలల్లోంచీ, అందమైన అమ్మాయిల నోళ్ళల్లోంచీ గొప్పగొప్ప సౌధాల్లోంచీ, నిశాగర్భం చీల్చుకుంటూ ఆ పాటలు పుంఖానుపుంఖంగా అక్షయతూణీరంలోంచి వచ్చే బాణాల్లో నా చెవుల్లోంచి గుండెల్ని దూసుకుంటూన్నాయి, పాటల్లో అతి తీయదనం గుండెని కబళిస్తుంది- మనిషినీ లోకంలోంచి తప్పిస్తుంది.

"లతాదేవి! నీకో నమస్కారం. దైవసాక్షిగా చెబుతున్నాం. నీవిక పాడడం మానివేయి. మేమంత తీయదనాన్ని భరించలేం. మా మనస్సులు చిల్లులు పడుతూన్నై. మా నిద్ర పాడైపోతోంది. మా బుద్ధి నశిస్తోంది క్రమంగా. మేం గాలిలో తేలిపోతున్నాం. గానం నీకు అమరత్వాన్ని ప్రసాదించిందిలే. ఇక పాడకు. అంతగా నీకు కళాభిరుచి వుంటే చక్కగా మూస్తాబై నృత్యం చేయడం నేర్చుకో. నీకు మా హృదయపూర్వక స్వాగతం. పైవిధంగా ఓ అప్లికేషన్ వ్రాసి నాలాంటి ఇంకా కొన్ని లక్షలమంది సంతకాలు తీసుకుని లతామంగేశ్కర్‌కి సమర్పించాలనివుంది నాకు.

"కాదు. లతా...లత ..లత పాడాల్సిందే. ఇంకా, అంతా వినాలి. గుండెల్లో వేదనాగ్నులు ప్రజ్వలించాలి. మేమంతా ఉన్మత్తులం కావాలి. వేణునాదం విన్న కోడెతాచుల్లా మరచి లత పాటకి అనుగుణ్యంగా శిరస్సులాడించేంత భయం ఉన్మాదం ఆవేశించాలి మాకు. అప్పుడే మా కథలో చివరి అధ్యాయం. అక్కడితో అంతం."

మళ్ళీ ఇలా ఆలోచిస్తు బృందావన్ ప్రొప్రైటర్ లక్ష్మినారాయణని చూస్తూ లత పాటలు ఆ హోటలుముందు నిలబడే వినోద్దుకుంటూనే

వింటూన్నా. ఇంతలో ఎక్కణ్ణించో బిలబిలా ప్రవేశించారు మిత్రులు సుబ్రహ్మణ్యం, రంగారావూ, రామకృష్ణ- ముగ్గురూ ఒకే తల్లి పిల్లల్లా. వాళ్ళు ముగ్గురూ నాతో కలిగానే నా కెందుకో సంతోషంతో ఎగిరి గంతేయాలనిపించింది. పదండిరా! ఓ మాంచి ఘాటైన బ్రూక్ బాండ్ టీ తలో ఒక టీ తీసుకుని మరీ కూర్చుందాం" అని అంతా ఒకేసారి అనడంతో ఒకేసారి నవ్వుకుంటూ హోటల్లోజొరబడ్డాం. 'బృందావన్'లో సుబ్రహ్మణ్యం ఎక్కౌంట్ ఉండనే వుంది, ఇక విచారం ఎవడికి?

మందమైన చుక్కల కాంతిలో మెరుస్తూ వెలిగే చంద్రుడి వెన్నెల్లా, రాళ్ళమీంచి ప్రవహించే మునేటి గలగల చప్పుడుతో, స్వచ్ఛంగా సుబ్రహ్మణ్యం నవ్వ ప్రతిక్షణం వినపడుతోనే వుంటుంది. ఆ నవ్వుకు అంతంలేదా అనే సంశయము నాకోసారి కలుగుతూంటుంది. సుబ్రహ్మణ్యం డి. పి. బి. క్లర్కు. చచ్చేంత చాకిరీ. వాడిజీతం అంతా ఇలా హోటళ్ళపాలే. వాడింకా బ్రహ్మచారిగా వుండడంవల్ల బతికిపోయాడనిపిస్తుంది.

ఇవాళ సుబ్రహ్మణ్యం నవ్వు "రామక్రిష్ణ" కెందుకో చిరాకు కలిగిస్తూన్నట్లే వుంది. "ఒరేయ్! ప్రతిక్షణం అర్థంలేకుండా ఏమిట్రా ఆ వెధవ నవ్వూ నువ్వూను?" అన్నాడు. రామక్రిష్ణకి పోస్టాఫీసులో వుద్యోగం. ఉదయం ఏడుగంటలకి వెళ్ళితే రాత్రి ఏడుగంటలకే మళ్ళీ కొంపకి చేరుకోవడం. చావడానికైనా తీరదు వాడికి అయినా రోజూ వాడు మాతో కలియందే తృప్తిపడేవాడు కాదు. ఇవాళ రామక్రిష్ణ చికాగ్గా వున్నాడు. అందుకే అలా అన్నాడు.

సుబ్రహ్మణ్యం తన నవ్వు నాపకుండానే "రామక్రిష్ణా! చచ్చేంతవరకూ ఇలానే నవ్వుతూంటానురా నేను. ఈ నవ్వుకోసం నేను రోజూ ఎన్నివేల కన్నీటిబొట్లో దారపోస్తాను! నాయీ నవ్వుతో యీ చరాచరప్రపంచం ప్రతిధ్వనించిపోవాలి. ఇంతకంటే నా కింకేమీలేదు" అన్నాడు అదోరకం బాధతో మళ్ళా బాధ కనిపించనీయనంత మామూలుదోరణిలో.

"బావుంది చాలా బావుంది నవ్వుకోసరం యేడవడం, ఏడుస్తూ నవ్వడం నవ్వుతూనే చస్తాననడం ఏమిట్రా నీ వెధవ ఫిలాసఫీ అంతాను. మా ప్రాణం తోడేస్తున్నావ్" అంటూ రామక్రిష్ణ ఇంకేదో అనబోతున్నాడు. సుబ్రహ్మణ్యం మధ్యలోనే అడ్డుకుని.

"మీకేం తెలుసురా బతుకునుగురించీ? ఏమీ తెలీకపోయినా అన్నిటినీగురించి రచనలు ఎలా సాగిస్తారో నా కర్థంకాదు. నా జీవితానికి రెండే రెండు ధర్మాలు తప్ప మరేమీలేవని లక్షసార్లు చెప్పాను. నవ్వులో ఏడుపు, ఏడుపులో నవ్వు... ఈ రెండు రసాత్మకక్రియలూ తోడుతోడుగా వర్ధిల్లాలంటే వీటికి ఘాటైన టీ, చార్మినార్ సిగరెట్ల సహకారం అత్యవసరం. ఒరేయ్! రామక్రిష్ణా! ఇంకోమాట నామీట నాకే విశ్వాసం లేదు... నాకు నేనే ఓసారి సమస్యగా, ఇంకోసారి పరిష్కారంగా, ఇంకోసారి ఫ్రాక్షన్‌లో పడ్డ లెక్కలా తయారవుతాను. ఉద్యోగంచేస్తూ కూడా ఇవాలిటివరకూ పైసా ఇంటికి పంపలేదు. పంపలేనుకూడాను. పోతే నాటీ, సిగరెట్లకే నా సంపాదనసహితం... ఇంకోసంగతి చెప్పల్లేకుండా వుత్తపాదాల్తో నడవాల్సినస్థితి వస్తుంది. కాని, అలా నడిస్తే అంతా వెక్కిరిస్తారనే భయంతో ఉపవాసం వుండైనా చెప్పులు కొనుక్కుని తీరాలి. ఎన్నిరోజులు నేను కూడులేకుండా గడుపుతానో ఎవడికితెలుసు? అసలెవరికి చెప్పను? ఇలా చెబితే మీరు పరిహసిస్తారు. గుండెల్ని పిండిచేసే మీ పరిహాసాలు భరిస్తూ బ్రతుకుతుంటాను నేను. మానవుడికీ, విజ్ఞానానికీ, వి చెజితా చదువుకీ, చదువుకీ సంస్కారానికీ, మంచికీ కీడుకీని అంతరాంతర సంబంధా లెలావుంటాయో ఆలోచించ బుద్ధవుతుంది. నేను ఆలోచిస్తాను. ఇంతకంటె మహోన్నత విషయాల్ని గురించికూడా ఆలోచిస్తూ నిద్రపోతాను. నిద్రలో నవ్వుతాను. మేలుకుని ఏడుస్తుంటాను. ఆకాశంతో మాట్లాడతాను. నీలాంటి మిత్రులుకలిస్తే వికృతంగా నవ్వుతాను. నవ్వడం ఏడవడం నాలో జీర్ణించుకుపోయాయిరా! అవి నన్ను వదలవు" అంటూ చిట్టచివరికి ఓ తాచుపాము బుసలాంటి నిట్టూర్పు విడిచాడు సుబ్రహ్మణ్యం.

"ఒరేయ్! నీకో వెయ్యనమస్కారాలు. కాస్తు

నీ యేడుపుల భాగోతం ఆపు, తాగిన టీనీళ్ళ మైకం వదిలిపోతోంది. నేనో చిన్నకథ రాశాను. ఐదునిమిషాలు పడుతుంది వినిపిస్తా నుండు” అంటూ రామక్రిష్ణ జేబులో చెయ్యిపెట్టాడు.

సుబ్రహ్మణ్యం ఈమారు హోటల్ హాలంతా అదిరేంత వికృతంగా నవ్వాడు.

“నీవే ఓ గొప్పకథ వైనప్పుడు ఇంకా నీవేం కథలు రాస్తావురా? నేనేం వింటాను? జీవితానికి అవతలొడ్డునున్న నాలుగు భయంకర సన్నివేశాలూ, రెండు ప్రణయ ఘట్టాలూ ఇరికిస్తే ఓ కథ అయిపోతుందా?...అలాంటి కథలు నాకు అవసరంలేదు...అసలెందుకూ అంట నీ పిచ్చికథలు? కథలురాస్తే కడుపునిండుతోందిరా? మానవుడి రోదనధ్వని మాటుమణిగి పోతుందా? ప్చ్...వట్టిది...అంతా బూటకం. బంగాళా దుంపలు పాతిపెట్టి, వరిపంట పండుతోందంటూ రాసే కథలు బతుక్కి పనికిరావురా! కథాప్రపంచంలో పడి నీ బతుకు మరచిపోతున్నావ్... పైగా నే సెప్పుడూ ఏడుస్తూంటాననని దబాయిస్తావ్?...” సుబ్రహ్మణ్యం ఈమారు చాలా ఉద్రేకంలో పడిపోయాడు. ఒకసారి నావేపు చూసి మళ్ళీ లంకించుకున్నాడిలాగ.

“ఒరేయ్! రామక్రిష్ణా! ఇటుచూడు· ఇవాళ నీ గదిలో డ్రాయరుమీదున్న వుత్తరం ఎక్కణ్ణించి వచ్చిందిరా? అది చదివావా? చెప్పు... చదివావా అని...? మీ అమ్మగారు గదుట్రా రాసింది? ఏముందందులో? యీనెల యింటుద్దే, స్కూల్ ఫీజూ ఈ నెలైనా చెల్లించకపోతే పరిస్థితి బాగుండదనికదూ రాసింది? నేను చూశానని కోప్పడకు. ఇవన్నీ వదలి...మనలోమాట.. నేనో గొప్పకథకుణ్ణని మందినిగురించి కథలురాయబోతావేం? అవినాకు వినిపిస్తానంటావ్ మళ్ళీ.... నీవు కథరాస్తే ఈనెల యింటద్దెబాకీగానీ మీ వాడి ఫీజుకానీ చెల్లిపోతాయట్రా? చెప్పవేం? ఎందుకామౌనం? కథవినిపిస్తావ్రా? నీకథవింటూంటే ఇంటద్దెకోసం యజమాని మీ అమ్మని కేకలేయడం వినొస్తుంది నాకు... వద్దులే...నీకథకన్నా ‘లతామంగేశ్కర్’ పాట వేయిరెట్లు మెరుగు...ఏదో కొంతబాధ అనుభవిస్తూనైనా వినొచ్చు...నీకథ విప్పకు. గుండెపగిలి చస్తాను.. నేనింక మాట్లాడన్లే” అంటూ సుబ్రహ్మణ్యం గప్పున నోరుమూసుకున్నాడు...రామక్రిష్ణ నిజంగానే బేజారెత్తి ఏమిటో ఆలోచిస్తున్నాడు.

నాలో వున్న మనిషెవడో మాట్లాడుతున్నట్టుంది..."నిజం. సుబ్రహ్మణ్యంమాటలు నూటికి నూరుపాళ్లు నిజం. కథరాస్తే ఇంటద్దెతీరుతుందా, బడిఫీజు రద్దవుతుందా? ఇంకా యీరాసిన కథలు ప్రకటించుకునే పత్రికలూ, ఈ రాసేవాళ్ళలానే వుంటాయి...లోపల ప్రచండమైన బాధతో వీళ్లు కథలురాసి పైకెంతో శాంతంగా కనిపిస్తారు... ఇక పత్రికలో...పై అట్టమీద చక్కనిముస్తాబూ, లోపల పొట్టలోకి తిండిలేదనిగోల...ఇంతేగా?” అని.

మేమంతా ఇలా సతమతమవుతోంటే రంగారావు, ఇందాకటినించీ గొప్పవేదాంతిలా మా మాటలన్నీ మౌనంగా వింటూ మా ముగ్గురి ముఖాలూ తదేకంగా పరిశీలిస్తున్నాడు. ఇండియా పాకిస్థాన్ పంచాయితీల పరిష్కారం గురించో, కొరియాయుద్ధం ముగింపుతెచ్చే విషయాన్ని గురించో లేక ఆంధ్రరాష్ట్ర సుస్థిరత్వాన్నిగురించో ఆలోచిస్తూన్నంత దీర్ఘమైన స్థితిలో వాడు మమ్మల్ని చూస్తున్నాడు. చేతిలో సిగరెట్టు వాడి నోట్లోంచి పొగకక్కుస్తోంది. ఇంతవరకూ వాడు ససేమిరా నోరువిప్పనేలేదు. వాడిచాత మాటాడించడం ఎలానాఅని నేననుకుంటున్నాను.

రంగారావు ఓ లైబ్రరియన్‌గా జీవితం గడుపుతున్నాడు. అస్తమానం వాడు పుస్తకాలమధ్య ఇరుక్కుని నలిగి, అంతో యింతో అంటించుకుని బయటపడితాడు.... చక్కగా కవిత్వం, కథలూ రాస్తాడు.... ఈమధ్య చాలామంది పత్రికలవాళ్లు వాడి రచనలకోసం వుత్తరాలు రాసేవాళ్ళు, కాని, వాడిష్టమైతేతప్ప చఃస్తేపంపకపోయేవాడు.... అప్పుడప్పుడు వాడు నాతో అంటూండేవాడు..."భాయీ! నా పద్యం వినాలని అంతకుతూహల పడతావుగాని, నేనివాళ భోంచేశానో లేదో తెలుసుకోవేం?”అని. వాడిష్టమైతే కోరని పత్రికకైనా రచనలు పోస్టుచేస్తాడు. అవి తిరిగొచ్చినాసరే అడిగే వాడికి పంపడు... పంపనికారణం నాకుతప్ప చస్తే మరొకడికి చెప్పడు. సంస్కారంలేని మొరటుమనిషిలా ప్రతి

మాటా గభాల్ని అనేస్తాను. అన్నందుకు పీస మెత్తు పశ్చాత్తాపంపడంగానూ వాణ్ణి మా మిత్ర బృందంలో ఎవడూ చూల్లేదు. వాడిజీవితం చార్లెస్‌డికెన్స్ పాత్ర 'సిడ్నీకార్టన్' జీవితం లాంటిది: కార్టన్‌కి సారాదుకాణం. వీడికి కాఫీ హోటల్. నేను పెద్దగా వాడి చెవికింద నోరు బెట్టి "అరే! కవిశార్దూలం! మేమంతా కొట్టుకు చస్తుండే పిల్లిలా అలాకూర్చుంటావేంరా? తగిలించు నీవీ రెండుముక్కలు. కథగానీ, కవిత్వంగానీ, ఏదైనాసరే" అన్నానునేను పెద్దగా.

వాడోసారి చిన్నగా నవ్వాడు. ఇతర్లకి ఆ నవ్వు అమాయకమైన పసిబిడ్డ నవ్వులానో, లేక వెకిలిగానో కనిపిస్తుందికాని, నాకుమాత్రం వాడి నవ్వు అతిభయంకరంగా, దెబ్బతిన్న కుక్కపిల్ల అరుపులా, అగాధంగా వుంటుంది. ఏదో బాధని చీల్చుకునివస్తూన్నట్టు వినిపిస్తుంది. చివరికి వాడూ నోరువిప్పాడు.

"ఒరే నాన్నలూ! ఇదిగో ఇటువినండి! కొన్ని హాలాత్సంఘటనలు ఎంత భయంకరంగా వుంటాయో, మన జీవితాలూ అలాంటివే. ఇదే జీవితానికి రూపం అంటే నమ్మండి ఇదిగో! ఈ బతుకులు వున్నాయే వీటినిగురించి మనం ఆలోచించకూడదురా! మన పరిసర వాతావరణాన్ని గురించి కానీ, ఏమాత్రం ఎన్నడూ ఆలోచించకండి. ఆలోచించడం పిచ్చితనంరా! ఊరికే వున్నా లేకున్నా అలా నిరంతరం విశ్రాంతిలేకుండా ముందుకు నడవడమే మనపని. ముందుకు నడవాలి కాని ఆలోచిస్తూ కూర్చోగూడదు. ఆలోచించామా? మన కళ్ళముందు నరకం ప్రత్యక్షమై కూచుంటుంది. ఆత్మవిశ్వాసం నాశనమవుతోంది. మన బుర్రల మీది జుట్టు రాలిపోయి, చివరికి లోపలేమీ మిగలకపోగా జవాబుకూడా దొరకదు మన బతుక్కి. ఆలోచించామంటే మనం ముందుకడుగెయ్యంలేం పిరికితనం వస్తుంది. ఆలోచన మనల్ని మృత్యువు సన్నిధికి లాక్కునిపోయి నిలబెడుతుంది. మన బాధలూ, గాథలూ, కథలూ, కల్పనలూ, అన్నీ వెంటదీసుకుని ముందుకే మనం నడవాలిరా! వద్దురా నాన్నలూ! ఎందుకలా ఆలోచిస్తారు మీరు? పదండి. అలానైతే మనం ఎవరెస్టుని నిముషంలో జయిస్తాం. ఎర్రకోట చరిత్రని మారుస్తాం. తాజమహల్ తలదన్నే సౌందర్యాన్ని నిర్మిస్తాం. అజంతా ఎల్లోరా గుహల్ని నవీన సాంస్కృతిక సంప్రదాయంలో పునఃచిత్రిస్తాం-ముందుకే నడుద్దాం. వెనక్కిపోయి చూసుకోకండి! దోవలా ఎదురయే అభిజాత్య సంపన్నుణ్ణీ, అతిదౌష్ట్యవర్తనుణ్ణీ ఇద్దర్నీ ఒకే రకంగా పలకరించండి. ఏడ్చేవాణ్ణి చూసి నవ్వండి. నవ్వేవాణ్ణి చూసి వాడికంటే వికృతంగా నవ్వండి కాని వెనక్కితిరిగి వాళ్ళతో మాట్లాడకండి. తిండిలేక చచ్చిన ముసలాళ్ళ అస్థిపంజరాలు కాళ్ళకి తగిలినా ఆగకండి. ఈ అస్థిపంజరాల్లోకూడా ఓ రోజున యౌవనం వెల్లువిరికేదనీ, వీళ్ళకి పిల్లాజెల్లా వుండే వుంటారనీ, వీళ్ళూ మనుషులేననీ, వీళ్ళూ ఒకనాడు కడుపునిండా తిని గౌరవంగా కాలక్షేపంచేసిన వాళ్ళే కావచ్చుననీ వాళ్ళ జీవితాల్లోకి చొరబడి చూడకండి. అలా వెళ్ళారో అంతా అగాధం. ఇంకా కూరుకుపోతారు దానిలో."

వీడిమాటలు విన్నాక ఇంతక్రితం తేంపుచ్చుకున్న బ్రూక్‌బాండ్ టీ చార్మినార్‌ల స్టిమ్యులేషన్ యావత్తూ కరిగిపోయింది. వాడిచూపుల్లో ఇందాకటిలాంతులేదు నిష్ఫురవ్వలుకనిపిస్తున్నై. సుబ్రహ్మణ్యం నవ్వుతో చేస్తున్నాడు. కాని ఆ నవ్వులో ఓ రకమైన స్పర్ధ .. రామకృష్ణ హానంలో భరించరాని వికటధ్వని. హోటల్ రేడియోలోంచి వచ్చే లతామంగేశ్ గానం లోంచి గుండెల్ని చీల్చే వేదన ప్రస్ఫుటమవుతున్నై. నే నెక్కడున్నానో నాకే అర్థంకాలేదు.

హోటల్ మూసేస్తున్నారల్లేవుంది. "లేవండి బాబూ! ఇక! రాత్రి పదిన్నర కావస్తోంది" అంటూ రేడియో స్విచ్ ఆఫ్ చేసి మమ్మల్ని గొడ్లెల్ని అదిలించేటట్టు ప్రొప్రైటర్ అదిలించడంతో ప్రపంచంలో పడ్డాను...

నలుగురం బలవంతాన బైటికొచ్చాం మోయలేనంత మౌనభారంతో...ఒకళ్ళనొకళ్ళు మాట్లాడించుకోవడం కూడా చేతకాని నరాల బలహీనతతో నలుగురం నాలుగుదిక్కులకీ వ్యాపించాం.

"ఆలోచించకండిరా! చస్తారు" అనే ధ్వని నన్ను వెంటబడి తరుముతూంటె, పాత బైక్ మీద పడి కొంపకిచేరుకుని అమ్మకి కనపడకుండా గదిలోకెళ్ళి పడుకున్నాను. నిద్ర పట్టిచావదు. ★